క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

ధన్వాడ: తెలంగాణ గురుకుల పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల ప్రిన్సిపాల్ ఎం.రాజారాం గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు అర్హులన్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉంటుందని తెలిపారు. ఈ నెల 9 నుంచి మార్చ్ 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరీక్ష ఫీజు చెల్లించండి

కోస్గి: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న అభ్యర్థులకు పరీక్షల ఫీజు చెల్లించేందుకు చివరి గడువు తేదీని ప్రభుత్వం ప్రకటించిందని హకీంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల అధ్యయన కేంద్ర ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ శ్రీలత ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 10 వరకు, అపరాధ రుసుంతో ఈ నెల 16వ వరకు ఫీజుల చెల్లింపునకు అవకాశం ఉందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు అధ్యయన కేంద్రంలోగానీ, 8374264862 నంబర్‌లో గానీ సంప్రదించాలన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



మక్తల్ : పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బీమా ఆధ్వర్యంలో వంద రోజులు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించడంపై జిల్లా గవర్నర్ రఘు, మాజీ గవర్నర్ రాధకృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. వందోరోజు సందర్భంగా మాట్లాడారు. అదేవిధంగా వివిధ కార్యక్రమాలను ప్రారంభించారు. కొండయ్య, శ్రీనివాస్‌గుప్తా, జిల్లా అడ్వయిజర్ దేవేందర్, అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి కృషి



మరికల్ : మైనారిటీ సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని జాతీయ మైనారిటీ కమిషన్ ఇన్‌చార్జ్ షాజిదాబేగం అన్నారు. పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం మరికల్‌కు వచ్చిన షాజిదాకు జిల్లా బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెను రాష్ట్ర బీజేపీ నాయకులు రతంగపాండురెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డిలతో పాటు ఇతర నాయకులు ఘనంగా సన్మానించారు ప్రభాకర్‌వర్ధన్, తిరుపతిరెడ్డి, కొండయ్య, వేణు, దేవేందర్‌గౌడ్, ఉమేష్‌లు పాల్గొన్నారు.

గిరిజా కల్యాణం

అమరచింత: పట్టణంలోని శివాలయంలో గురువారం గిరిజా కల్యాణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం శివ మహాపడి పూజ అనంతరం మరుసటి రోజు శివ పార్వతులకు కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ దంపతులు పార్వతిదేవి తరుపున పూజల్లో పాల్గొన్నారు. వేడుకల్లో అమ్మవారికి మాంగళ్యధారణ చేశారు. పూజారి జంగం జగదీశ్ ఆధ్వరయలో వేడుకలు కన్నుల పండువగా కొనసాగాయి.

అరెస్టులు సరికావు

ఆత్మకూర్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని హైదరాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు వెళ్తున్న తమను అరెస్టు చేయడం సరికాదని జిల్లా సహాయ కార్యదర్శి శ్రీహరి, భారతీయుడు అన్నారు. గురువారం ధర్నాకు వెళ్లకుండా పోలీసులు నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి కూని చేయడమే అన్నారు. అర్హులైనవారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అమరచింత: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో నిర్వహించే ధర్నాకు గురువారం మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. సీపీఎం నాయకులు వెంకటేష్, రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 22 ప్రాంతాల్లో ప్రజలు గుడిసెల పోరు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పరంగా ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

కోయిల్‌కొండ: మండలంలోని గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న నర్సరీలను ఎంపీడీఓ జయరాములు గురువారం జమాల్‌పూర్, మోదీపూర్ గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలకు తగిన మోతాదులో నీటిని, ఎరువులను అందించాలని సూచించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయకుండా గడువులోగా మొక్కలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సయ్య పాల్గొన్నారు.

అంతర్గత దారులకు నిధులు



మరికల్ బీసీ కాలనీలోని మట్టిరోడ్డు

- 187 గ్రామాలలో రూ.9.74 కోట్లతో సీసీ రోడ్ల ఏర్పాటుకు చర్యలు
- మార్చిలోపు పూర్తి చేయాలని అధికారుల ఆదేశాలు
- తీరనున్న కష్టాలు

మరికల్: జిల్లాలోని ఆయా గ్రామాలు, మండల కేంద్రాలు తదితర చోట్ల ఉన్న మట్టిరోడ్లకు అధికారులు చరమగీతం పాడనున్నారు. వాటిని సీసీ దారులుగా మార్చి వాహనదారుల సమస్యలు తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సీసీరోడ్లను వేయనున్నారు. నారాయణపేట పంచాయతీ డివిజన్ పరిధిలోని 187 గ్రామ పంచాయతీల్లో రూ. 9.74 కోట్ల నిధులతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో అంతర్గత రహదారులు గుంతలమయంగా మారి, మురుగునీరు నిలుస్తూ అధ్వానంగా ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో పరిస్థితి మారనుంది. ఈ పనులు ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు పూర్తి చేయాలని అధికారులు సర్పంచ్‌లపై ఒత్తిడి పెంచుతున్నారు.

మరికల్‌కు అత్యల్పం..మద్దూర్‌కు అత్యధికం

ఉపాధి హామీ పథకంలో మరికల్ మండలానికి అత్యల్పంగా రూ.1.02 కోట్లతో 24 సీసీరోడ్లు మంజూరయ్యాయి. మద్దూర్ మండలానికి అత్యధికంగా 45 సీసీరోడ్లకు రూ. 2.45 కోట్ల నిధులు కేటాయించారు. ఆ తర్వాత కోస్గి మండలానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. సాధ్యమైనంత తొందరగా పనులు చేపట్టి పూర్తి చేస్తే వెంటనే నిధులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

గతేడాది 139 గ్రామాలకు

గతేడాది జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద నారాయణపేట, మక్తల్ పంచాయతీ రాజ్ డివిజన్లకు కలిపి రూ. 8.86 కోట్లతో 139 గ్రామాలకు సీసీరోడ్ల పనులు మంజూరయ్యాయి. ఈసారి కేవలం నారాయణపేట పంచాయితీరాజ్ డివిజన్ పరిధిలోనే రూ. 9.74 కోట్లతో 187 గ్రామాలకు పనులు మంజూరయ్యాయి. ఇవి కాక మక్తల్ డివిజన్ పరిధిలోని కృష్ణ, మాగనూర్, ఊట్కూర్, మక్తల్, నర్వ మండలాలకు సీసీరోడ్లు మంజూరు అయ్యాయి. వీటన్నింటిని లెక్కిస్తే గతేడాది కన్నా రెట్టింపు స్థాయిలో నిధులు మంజూరయ్యాయి.

పేట డివిజన్ ఇలా...

మండలం	నిధులు (రూ.కోట్లలో)
మద్దూర్	2.45
కోస్గి	1.80
దామరగిద్ద	1.67
నారాయణపేట	1.56
ధన్వాడ	1.25
మరికల్	1.02

మార్చిలోగా పూర్తిచేయాలి

పంచాయితీరాజ్ డివిజన్ పరిధిలో ఉపాధి పథకం కింద మంజూరైన సీసీరోడ్ల పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మండలాల్లోని ఏఈలు, సర్పంచ్‌లకు వివరించాం. మార్చిలోగా పనులు పూర్తి చేయాలి. ఎంత త్వరగా పూర్తిచేస్తే అంత తర్వగా నిధులు వచ్చే అవకాశం ఉంది. – నరేందర్, పీఆర్ ఈఈ

వేతనాలు విడుదల చేయాలని ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాగనూర్: మండలంలోని పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న గ్రామ సిబ్బందికి గత రెండు నెలలుగా వేతనాలను పెండింగ్ ఉంచారని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ ఆంజనేయులు అన్నారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని గురువారం మండల ప్రజాపరిషత్తు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది నర్సిములు, హరీఫ్, మారెప్ప, సీఐటీయూ నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి

మద్దూరు: విద్యార్థులు చిన్నప్పటి నుంచే లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించడానికి కష్టపడి, క్రమశిక్షణతో చదవాలని షీటీమ్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ సుధమాధురి అన్నారు. గురువారం మండలంలోని కొమ్మూరు ఉన్నత పాఠశాలలో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, అమ్మాయిలను వేధించడం తదితరాలను వివరించారు. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలన్నారు. విద్యార్థినిలు వేధింపులకు గురైతే జిల్లా షీటీం హెల్ప్‌లైన్ నెంబర్ 7901022492 కు లేదా 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పోలీసులు బాల్‌రాజ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సుధామాధురి

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



సావిత్రను అభినందిస్తున్న నిర్వాహకులు

నారాయణపేట రూరల్ : మండలంలోని పిల్లిగుండ్ల తండాకు చెందిన వ్యవసాయ కూలీలు బుగ్గమ్మ, కిషన్ నాయక్‌ల రెండవ కుమార్తె సావిత్ర జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైంది. మూడేళ్లుగా అదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతున్న ఆమె గురువారం కరీంనగర్‌లో జరిగిన 7వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో టోర్నమెంట్‌లో సత్తా చాటింది. ఈ మేరకు గ్రామ కార్యదర్శి జ్యోతి, ఉప సర్పంచ్ రవి నాయక్, బీజేపీ నాయకులు రాందాస్‌నాయక్, యువజన నాయకులు చంద్రశేఖర్ నాయక్, విజయ్‌చౌహాన్, గ్రామ పాఠశాల ఉపాధ్యాయులు శంక్రప్ప, కురుమూర్తి, నవితలు విద్యార్థిని అభినందించారు.

పాదయాత్రగా తరలిన శివభక్తులు



ధన్వాడలో శ్రీశైలానికి తరలుతున్న భక్తులు



మల్లెపల్లిలో..

ధన్వాడ: మండల కేంద్రంలోని శివమాలాధారులు గురువారం శ్రీశైలానికి తరలివెళ్లారు. అంతకుముందు స్వామికి ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు ధరించారు. వారిని సాగనంపడానికి భక్తులు అధికసంఖ్యలో వచ్చారు.

ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లి గ్రామంలో గురువారం 80 మంది శివభక్తులు శ్రీశైలక్షేత్రానికి పాదయాత్ర చేపట్టారు. అంతకుముందు శివాలయం దగ్గర ఇరుముడులు కట్టుకొని పూజలు నిర్వహించారు. సర్పంచ్ మాణిక్యమ్మ, నాయకులు కత్తలప్ప, మల్లేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

మద్దూరు: మండలానికి చెందిన శివభక్తులు గురువారం గురుస్వాములచేత ఇరుముడు కట్టించుకొని శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. మండలంలోని మోమినాపూర్ గ్రామానికి చెందిన కన్నప్ప, నర్సింహా, వెంకటేష్, కాంత్రిలు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ విశాలాక్షి

దామరగిద్ద: మండలంలోని ఉడ్మల్‌గిద్ద గ్రామంలో ఈజీఎస్ నిధులతో మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులను సోమవారం సర్పంచ్ విశాలాక్షి, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డిలు వార్డు మెంబర్ సమక్షంలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంతర్గత రహదారుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కాగా సకాలంలో పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు.

భక్తశ్రద్ధలతో లక్ష పుష్పార్చన



మక్తల్: పట్టణంలోని ఆలయంలో గురువారం షిరిడిసాయిబాబా , శ్రీదత్తాత్రేయస్వామి, గణపతులకు లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. నాలుగో వార్షికోత్సవం సందర్భంగా భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు. గణేష్‌కుమార్, రామలింగప్ప, లావణ్య, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల



ఊట్కూరు: గ్రామపంచాయితీ సిబ్బంది పాదయాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటరామారెడ్డి కోరారు. గురువారం ఊట్కూరులో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. 12న పాదయాత్ర ప్రారంభం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బి నారాయణ, బలరాం, హర్షన్, రోశనప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యత లేని రోడ్లు వేస్తున్నారు'

కోస్గి: మున్సిపల్ విలీన గ్రామం గుండ్లపల్లిలో ఎసీ రోడ్లు నాణ్యత ప్రమాణాలు లేకుండా వేస్తున్నారని జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. నాసిరకంగా రోడ్డు వేసిన కాంట్రాక్టర్ కనీసం క్యూరింగ్ చేయడం లేదన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారీతిగా రోడ్డు నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులైన చిన్నారులు



సోమేశ్వర్‌బండలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

నారాయణపేట రూరల్ : మండలంలోని బండగొండ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంఈఓగా రాములు, హెచ్‌ఎంగా దీపికలు వ్యవహరించగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. ఎస్ఎంసీ చైర్మన్ శివశంకర్, ప్రధానోపాధ్యాయులు శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు సుదర్శన్, సాయికుమార్, రవికుమార్, వెంకటమ్మ, రవిందర్, పవన్, సౌమ్య పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని సోమేశ్వర్‌బండ గ్రామంలోని యూపీఎస్‌లో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఒక రోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. కలెక్టర్‌గా అర్చన, డీఈఓగా రాజు, ఎంఈఓగా భరత్, హెచ్‌ఎంగా శివ, లక్ష్మి, ఉపాధ్యాయులుగా శ్రీలత, నవ్య, గణేష్, రమేష్, శంకర్‌లు వ్యవహరించారు. అనంతరం బోధనలో చక్కటి ప్రతిభ కనబర్చిన వారికి పాఠశాల ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.



బండగొండలో..

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి

మాగనూర్: గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం రూ. కోట్లు ఖర్చుచేస్తున్న ప్రభుత్వం ఆయా మార్గాలలో ఉన్న ప్రమాదకర మూలమలుపులను మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. మండలంలోని అడవిసత్యారం - కొల్పూర్ గ్రామాల మధ్య ఓ మూలమలుపు ప్రమాదకరంగా ఉందని, అక్కడ నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెబుతున్నారు. సమస్య పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అవసరం ఉన్న చోట సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని, మూలమలుపుల వద్ద ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించాలని కోరుతున్నారు.



అడవిసత్యారం సమీపంలో పరిస్థితి ఇలా..

శిథిలావస్థలో పాఠశాల భవనం



వర్కూర్ పాఠశాలలో శిథిలావస్థలో భవనం

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఓ భవనం శిథిలావస్థకు చేరుకొంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు 267 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడే అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉండటంతో శిథిలావస్థ భవనం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు భయందోళనకు గురవుతున్నారు. భవనాన్ని వెంటనే కూల్చివేసి, మరో అదనపు భవనం నిర్మించాలని కోరుతున్నారు.

పాదయాత్ర కరపత్రం విడుదల

మరికల్: మండల కేంద్రంలో చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకటరాములు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల మన్నెవాగు, రామస్‌పాడ్ డ్యాం తదితరాలు కలుషితమవుతాయని అన్నారు. కోయిల్‌సాగర్ నీళ్ల రైతులకు అందకుండా దోచుకుంటున్నారని ఆరోపించారు. సుదర్శన్, చంద్రశేఖర్, యాదగిరి, నాగరాజు, లక్ష్మయ్య, మురళి, రామచంద్రయ్య, మధు, కాలబాబు, తిరుపతయ్య, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలతో నాయకులు

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషిచేస్తాం



జెండా ఆవిష్కరణ చేస్తున్న నర్సింహారెడ్డి

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి అన్నారు. ఓ ప్రైవేటు కళాశాల ప్రాంగణంలో గురువారం ఆ సంఘం ఆవిర్భావ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంఘం పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ అభివృద్ధిలో పీఆర్‌టీయూ పాత్ర ఎంతో ఉందని, టీచర్లు, పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. పంచాయతీరాజ్ టీచర్ల ఆత్మగౌరవాన్ని నిలబెట్టామని చెప్పారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుర్రం చెన్నకేశవరెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిద్దామని పిలుపునిచ్చారు. లక్ష్మారెడ్డి, సంతోష్‌కుమార్, నారాయణరెడ్డి, నరేష్, అరవింద్, బాలాజీ, తిమ్మారెడ్డి, కృష్ణయ్య, కురుమూర్తి పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రలో గురువారం పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి భాస్కర్, నాయకులు శేఖర్‌రెడ్డి, రవికుమార్, గురునాథ్, జయశ్రీ పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా హిందూపూర్ కూడలి

- స్పీడ్ బ్రేకర్లు, సూచికబోర్డుల ఏర్పాటులో జాప్యం
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు





ఎలాంటి సూచిక బోర్డులు లేని హిందూపూర్ కూడలి

కృష్ణా: మండలంలోని హిందూపూర్ గ్రామంలో ఉన్న నాలుగురోడ్ల కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం ఇక్కడ ఎదో ఒక ప్రమాదం చోటుచేసుకుంటోంది. రోడ్డు వెడల్పు, డివైడర్ ఏర్పాటు తరువాత ఇవి మరీ ఎక్కువ అయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డివైడర్లతో పాటూ వాటికి ఎత్తైన గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో ఎటువైపు నుంచి వాహనాలు వస్తున్నాయో ఇతర వాహనాల చోదకులు గ్రహించలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో పగలు, రాత్రితో సంబంధం లేకుండా నిత్యం ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యల విషయంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఈ విషయంపై గతంలో పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు కూడా ఇచ్చామని గ్రామస్తులు అంటున్నారు. రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు కానీ, హెచ్చరిక బోర్డులు కానీ ఏర్పాటు చేసినట్లయితే ప్రమాదాలు తగ్గించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



కూడలిలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో రోడ్డు పై ప్రయాణించాలంటే ప్రజలు జంకుతున్నారు. చౌక్‌లో ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహం గతంలో ఓ లారీ ఢీ కొనడంతో పగిలిపోయింది. మళ్లీ కొత్త విగ్రహంను ఏర్పాటు చేశాం. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలి.

– ఆంజనేయులు, హిందూపూర్

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



హిందూపూర్ కూడలిలో ప్రమాదాలను నివారించేందుకు తక్షణమే హెచ్చరికల బోర్డులతో పాటూ మూడు నాల్గు చోట్ల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ఈ కూడలి అనేక సార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. విషయంపై ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మీనారాయణగౌడ్, సర్పంచ్, హిందూపూర్